క్లుప్తంగా

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ప్రత్తిపాడు: యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని.. వాటికి దూరంగా ఉండాలని ప్రత్తిపాడు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఎస్ఐ ఎం.రవీంద్ర బాబు అన్నారు. నియోజకవర్గ కేంద్రంలో శనివారం మాదక ద్రవ్యాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరుతూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడితే అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందన్నారు. అదే విధంగా గంజాయి, సిగరెట్లు, మద్యం వంటి వ్యసనాలకు బానిసలు కావొద్దని కోరారు. మాదక ద్రవ్యాల కేసులు తమపై నమోదైతే బంగారు భవిష్యత్తు బుగ్గిపాలవుతుందని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది, యువత పాల్గొన్నారు.

స్పందించి.. పరిష్కరించి



సాక్షి ఎఫెక్ట్

పొన్నూరు: పట్టణంలోని ప్రధాన రహదారిలో ప్రమాదకరంగా మారిన గుంతల సమస్యకు పరిష్కారం లభించింది. ఈ నెల 21వ తేదీన సాక్షిలో 'గుంత.. ప్రమాదాలతో చింత' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం కూరగాయల మార్కెట్ సెంటర్, మున్సిపల్ కార్యాలయం సమీపంలోని ప్రధాన రహదారిపై గుంతలను పూడ్చే విధంగా చర్యలు చేపట్టారు. అధికారుల చర్యల పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

ఎయిడ్స్ నివారణపై కళాజాత ప్రదర్శన




ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడులో ఎయిడ్స్ నివారణపై నవ చైతన్యం కళాజాత బృందం శనివారం ప్రత్యేక ప్రదర్శనను నిర్వహించారు. గుంటూరు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ(దిశ) పర్యవేక్షణలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాజాతర బృందం జానపద గేయాలు, వీధి నాటకాల ద్వారా హెచ్ఐవీ, ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ ఎలా సంక్రమిస్తుంది, చికిత్స, తీసుకోవాల్సిన జాగ్రత్తలను గేయాల రూపంలో వివరించారు. హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపడం చట్ట రీత్యా నేరమని తెలిపారు. కార్యక్రమంలో లింక్ వర్కర్ స్కీం ప్రాజెక్ట్ డీఆర్పీ ఎం.వాసుదేవరావు, సీహెచ్ అశోక్‌కుమార్, జోనల్ సూపర్‌వైజర్ బి.నాగేశ్వరరావు, లింక్ వర్కర్ కె.శేఖర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేకంగా ప్రవర్తిస్తే ఉపేక్షించం

పొన్నూరు: పట్టణంలో ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా ఉపేక్షించమని సీఐ వీరా నాయక్ హెచ్చరించారు. వివిధ ప్రాంతాలలో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ బలవంతంగా భిక్షాటన చేస్తున్న ట్రాన్స్‌జెండర్లకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. బలవంతంగా డబ్బులు వసూలు చేయడం, ప్రజల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం వంటివి చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇకపై అలాంటి కార్యకలాపాలను మానుకోవాలని తెలిపారు.

వైభవంగా ప్రసన్నాంజనేయస్వామి గ్రామోత్సవం



నగరంపాలెం: స్థానిక మారుతీనగర్‌లోని కంచి కామకోటి పీఠం మారుతి దేవాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న హనుమాన్ జయంతి మహోత్సవాలు శనివారం మూడో రోజుకు చేరాయి. సురస్రా సమేత ప్రసన్నాంజనేయస్వామి ఊరేగింపు పుర వీధుల్లో వైభవంగా నిర్వహించారు. భక్తులు బారులు తీరి స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం ప్రదోషకాల నందీశ్వర అభిషేకం, సువర్చల సమేత ప్రసన్నాంజనేయస్వామి కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా భక్తి శ్రద్ధలతో చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు కొరప్రాటి రామారావు, కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఖాళీ కుర్చీలు.. తాళాలు వేసిన గదులు

- ఇష్టానుసారం విధులకు హాజరవుతున్న అధికారులు, సిబ్బంది
- సమస్యలంటూ వచ్చిన వారికి దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు



మధ్యాహ్నం 12.18 గంటలకు తాళాలు వేసిన రైతు సేవా కేంద్రం

ప్రత్తిపాడు: ప్రభుత్వ శాఖల సిబ్బందికి నిర్లక్ష్యపు 'శని' గ్రహణం పట్టింది. విధులకు ఎప్పుడు హాజరవుతారో.. ఎప్పుడు కార్యాలయాలకు తాళాలు వేసి వెళ్లిపోతారో తెలియని పరిస్థితి మండలంలో చోటు చేసుకుంటుంది. శనివారం ఉదయం 11 గంటలకు కూడా ఆయా శాఖల అధికారులు, సిబ్బంది విధులకు హాజరుకాని దుస్థితి నెలకొంది. ఖాళీ కుర్చీలు అధికారుల అలసత్వాన్ని వెక్కిరిస్తున్నాయి. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది 11.36 గంటలకు తాపీగా కార్యాలయానికి హాజరయ్యారు. విద్యాశాఖ కార్యాలయంలో మండలాధికారుల కుర్చీలు ఆ సమయానికి కూడా ఖాళీగానే దర్శనమిచ్చాయి. ఇక హౌసింగ్ కార్యాలయం అయితే మధ్యాహ్నం 12 గంటల వరకూ తెరుచుకోలేదు. అదే విధంగా వ్యవసాయశాఖ కార్యాలయం పక్కనున్న రైతు సేవా కేంద్రంలో 12.18 గంటల వరకూ సిబ్బంది ఎవ్వరూ రాకపోవడంతో కేంద్రం తెరుచుకోలేదు.



శనివారం మధ్యాహ్నం 12.10 గంటలైనా తెరుచుకోని హౌసింగ్ కార్యాలయం



ఉదయం 11.50 గంటలకు ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న పశుసంవర్థక శాఖ ల్యాబ్

ఎప్పుడొస్తారో తెలీదు..

అగ్రిల్యాబ్‌లోని పశుసంవర్థక ల్యాబ్‌లో మధ్యాహ్నం 12 గంటలైనా సిబ్బంది హాజరుకాలేదు. దీంతో వివిధ పనుల నిమిత్తం ఆయా కార్యాలయాలకు వచ్చిన ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. సమస్యలంటూ వచ్చిన వారికి తాళాలు వేసిన గదులు, ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. ఇది ఈ ఒక్క రోజు పరిస్థితే కాదు. నిత్యం ఇదే పరిస్థితి మండలంలో కనిపిస్తుందని ప్రజలు వాపోతున్నారు. ఇదిలా ఉంటే కొన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఫీల్డ్ విజిట్‌ల పేరుతో విధులకు ఎగనామం పెడుతున్నారని.. మరికొందరు ఎప్పుడు వస్తారో కూడా తెలియని పరిస్థితి ఉందని సమాచారం. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కూలిన శివాలయం ప్రహరీ

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులోని శ్రీ గంగా పార్వతీ సమేత దండేశ్వరాలయం (శివాలయం) తూర్పు ప్రహరీ గోడ శుక్రవారం అర్ధరాత్రి కూలిపోయింది. గత వారం రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా ఆలయ ప్రహరీ గోడ నేలకొరిగి ఉంటుందని అర్చకులు, స్థానికులు భావిస్తున్నారు. వర్షానికి తడిసిన గోడ రాళ్ల గుట్ట పక్కనే ఉన్న సీసీ రోడ్డుపై పడిపోయింది. అర్ధరాత్రి జనసంచారం లేని సమయం కావడంతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదు. కూలిన ప్రదేశంలోనే బావి, నవగ్రహాలు ఉంటాయి. అదే భక్తుల తాకిడి ఉన్న సమయంలో జరిగి ఉంటే పెనుప్రమాదం సంభవించి ఉండేది. ఉదయాన్నే ఆలయానికి వచ్చిన అర్చకులు పత్తిపాటి పరమేశ్వర శర్మ గోడ కూలిపోయి ఉండడాన్ని గమనించి విషయాన్ని దేవదాయశాఖ అధికారులకు తెలియజేశారు. గతంలోనూ ఉత్తరం, పడమర, దక్షిణ దిక్కుల్లోని ప్రహరీ గోడలు పడిపోయిన సందర్భాలు ఉన్నాయి. తాజాగా ఇప్పుడు మిగిలిన నాలుగో దిక్కు ప్రహరీ గోడ కూలిపోవడం స్థానికంగా చర్చనీయాంశమయ్యింది.



అర్ధరాత్రి కూలిన ప్రహరీ

రోడ్లపై వ్యర్థాలను వేయకండి

ప్రత్తిపాడు: రోడ్లపై వ్యర్థాలను వేయకుండా స్వచ్ఛ పంచాయతీకి ప్రజలతో పాటు వ్యాపారస్తులు కూడా సహకరించాలని పంచాయతీ కార్యదర్శి షేక్.ఖాజా కోరారు. శనివారం నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు మెయిన్ రోడ్డులోని దుకాణ దారులకు నోటీసులు అందించారు. రోడ్లపై చెత్త, వ్యర్థాలను పడేయవద్దని.. దుకాణ దారులు చెత్త డబ్బాలను ఏర్పాటు చేసుకుని అందులోనే వ్యర్థాలను పడేయాలన్నారు. ఇప్పటి వరకు గ్రామంలోకి ఉదయం మాత్రమే చెత్త సేకరణ వాహనం వస్తుందని.. ఆదివారం నుంచి వ్యాపారస్తుల కోసం మధ్యాహ్నం కూడా చెత్త సేకరణ వాహనాన్ని గ్రామంలోకి పంపిస్తామని అన్నారు. వ్యాపారస్తులు పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు పంచాయతీకి సహకరించాలని నోటీసులో పేర్కొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రత్తిపాడు: మద్యం షాపుల లైసెన్స్ నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని ప్రత్తిపాడు ఎక్సైజ్ స్టేషన్ ఎస్ఐ ఎం.రవీంద్ర బాబు తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలోని మద్యం దుకాణాల పక్కన టెంట్లు వేసి, అనధికారికంగా పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేసి మందు బాబులతో సిట్టింగ్‌లు వేయిస్తున్నారని ఎక్సైజ్ సీఐ అశోక్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో సీఐ ఆదేశాల మేరకు ఎస్ఐ రవీంద్ర శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం మద్యం దుకాణాల వద్ద సిబ్బందితో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుకాణాల పక్కన మందు బాబుల కోసం ఏర్పాటు చేసిన టెంట్లును తీసివేయాలని.. టెంటు కింద నిర్మించిన అరుగులను తొలగించాలని ఆదేశించారు. అనధికారికంగా మద్యం దుకాణాల సమీపంలో ఎలాంటి సిట్టింగులూ ఏర్పాటు చేయడానికి వీలు లేదని స్పష్టం చేశారు. లైసెన్సీలు నిబంధనలకనుగుణంగా నడుచుకోకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నెహ్రూనగర్: గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో రూ.3.15 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర శనివారం శంకుస్థాపన చేశారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 54, 56 డివిజన్లలో రూ.2.43 కోట్లతో, పశ్చిమ నియోజకవర్గంలోని 45వ డివిజన్లో రూ.72.20 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి పైప్‌లైన్లు ఏర్పాటుకు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నజీర్ మహ్మద్, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు గల్లా మాధవిలతో కలిసి శంకుస్థాపన చేశారు. మేయర్ మాట్లాడుతూ నగరంలో చిన్నపాటి వర్షానికే రోడ్ల పై వర్షపు నీరు నిలిచి స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వీటిని దృష్టిలో పెట్టుకొని స్థానిక ప్రజాప్రతినిధుల ప్రతిపాదనలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. గుంటూరు నగరంతోపాటు నగరంలో విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులు పార్టీలకతీతంగా ప్రాధాన్యతా క్రమంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొమ్మినేని కోటేశ్వరరావు, అయిశెట్టి కనకదుర్గ, మల్లవరపు రమ్య, ఈరంటి వరప్రసాద్, ఈఈ సుందర్రామిరెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మేయర్ రవీంద్ర, ఎమ్మెల్యే నజీర్

తుక్కు...తుక్కు...

- మట్టిలో కలిసిపోతున్న విలువైన వాహనాలు
- పోలీసుస్టేషన్‌లు, ఆర్టీఓ కార్యాలయాల్లో మగ్గిపోతున్న వాహనాలు
- గుట్టలు...స్టేషన్‌లలో ఉండిపోతున్న పరిస్థితి
- నగరంలోని స్టేషన్ పరిధిలోని సుమారు 1000పైగా వాహనాలు
- మట్టి పాలైపోతున్న ప్రజల సంపద



ఆర్టీఓ కార్యాలయంలో మగ్గిపోతున్న వాహనాలు

పట్నంబజారు: కేసు ఏదైనా కావచ్చు.. వాహనం ఎన్ని లక్షలైనా అవ్వచ్చు.. పోలీసుల నిర్లక్ష్యమో.. లేక వాహనదారులు పట్టించుకోని తనమో.. విలువైన వాహనాలు పోలీసుస్టేషన్‌లు, ఆర్టీఓ, ఎక్సైజ్ కార్యాలయాల్లో మగ్గిపోతున్నాయి. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ.. ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. అయినా పట్టించుకుని.. వేలం పాట తరలించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనితో ప్రజాధనం మట్టిపాలైపోతోంది.

నగరంలో పరిస్థితి ఇలా..

గుంటూరు నగరంలోని ఈస్ట్, వెస్ట్ సబ్‌డివిజన్‌ల పరిధిలో మొత్తం ఆరు లా అండ్ ఆర్డర్ పోలీసుస్టేషన్‌లు, రెండు ట్రాఫిక్ స్టేషన్‌లు, ఎక్సైజ్ స్టేషన్‌లు రెండు, జిల్లా ఆర్టీఓ కార్యాలయం ఉన్నాయి. అయితే వీటి పరిధిలో అనేక వాహనాలు ఏళ్లకు తరబడి అయా కార్యాలయాల పరిధిలో ఉండిపోయి.. తుక్కుతుక్కుగా మారిపోతున్నాయి. ఆయా స్టేషన్ పరిధిలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలు తరలించిన వాహనాలు, కరోనా సమయంలో నిబంధనలు పట్టించుకోకుండా పట్టుకున్న వాహనాలు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వెహికల్స్, అక్రమ మద్యం సరఫరా చేస్తూ పట్టుబడిన వాహనాలతో పాటు అనేక ప్రమాదాల్లో కూడా సీజ్ చేసిన వాహనాలు స్టేషన్‌ల్లోనే సమాధి అవుతున్నాయి.

వాహనాలపై ఆసక్తి చూపని వైనం..

కేసులు పరిష్కారం కాకనో లేక కేసులో పట్టుబడిన వాహనాలపై యజమాని ఆసక్తి చూపకపోవడమో... వంటి కారణాలతో సంవత్సరాల తరబడి అక్కడే ఉండిపోతున్నాయి. ఎంతో విలువైన ఈ వాహనాలు తుప్పు పట్టి పనికిరాకుండా పోతున్నాయి. అందులోనూ కొన్ని పోలీస్ స్టేషన్లలో వీటిని ఉంచేందుకు స్థలం లేక ఎక్కడైనా ఖాళీ స్థలం ఉంటే అక్కడ పెట్టేస్తున్నారు. ఈస్ట్ ట్రాఫిక్ స్టేషన్‌లో పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో, వెస్ట్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో, అరండల్‌పేట పీఎస్ పరిధిలో వెనుక ఉన్న తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో, నల్లపాడు పీఎస్‌లో పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో, కొత్తపేట పీఎస్ పరిధిలో మరీ నడిరోడ్డులో వాహనాలను పెట్టి వదిలేస్తున్నారు. ఆ తరువాత వాటి గురించి పట్టించుకోని పరిస్థితులు ఉండటంతో వాహనాలు ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. సుమారు 1000పైగానే వాహనాలు నగర పరిధిలోని స్టేషన్‌ల పరిధిలో మగ్గిపోతున్నాయంటే అధికారులు నిర్లక్ష్యం కళ్ళకు కట్టినట్లు కనపడుతోంది. పలు వాహనాలకు సంబంధించి పార్ట్‌లు కూడా చోరీకి గురవుతున్న పరిస్థితులు. బ్యాటరీలు, ఇంజన్‌లు కూడా పలు వాహనాలకు లేకుండా కనపడుతున్నాయి.

> **గతంలో వేలం పాటతో ప్రభుత్వానికి రాబడి**
>
> గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పట్టుబడిన వాహనాల కేసులను త్వరితగతిన పరిష్కరించి యజమానులు తీసుకుపోకుంటే వెంటనే వేలం వేసేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి మూడు నెలలకు పోలీసు, సెబ్ స్టేషన్లలో వేలం నిర్వహించేవారు. ఈ విధంగా చేయడం వలన విలువైన వాహనాలు మట్టిలో కలిసిపోకుండా ప్రభుత్వానికి రాబడి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. పట్టుబడిన వాహనాలను నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. దీనివలన ప్రజాధనం వృథా అవుతుందే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండడం లేదు.

సీజ్ చేసిన వాహనాలు..



లాలాపేట పీఎస్‌లో వాహనాల ప్రదేశంలో కేసుల్లోని వాహనాలు

ప్రమాదాలు, కేసుల్లో పట్టుబడి సీజ్ చేసిన వాహనాలకు సంబంధించి రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించాలి. పంచనామా నిర్వహించిన వాహనాలను ఆరు నెలలకు ఒకసారి బహిరంగ వేలం ద్వారా విక్రయించాలి. పోలీసులు ఆర్టీఓ అధికారులు సంప్రదించి వేలం నిర్వహించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఇటీవల కాలంలో రెండు సార్లు వేలం నిర్వహిస్తున్నామని ప్రకటించిన ఆర్టీఓ అధికారులు పలు కారణాల రీత్యా వాయిదా వేసిన పరిస్థితులు. అధికారులు దృష్టి సారించి వాహనాలు మట్టిపాలు కాకుండా చర్యలు తీసుకోవాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అగ్రికల్చర్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

ప్రత్తిపాడు: మండల పరిధిలోని యనమదల బి.ఆర్ అండ్ ధనలక్ష్మి పాలిటెక్నిక్ ఆఫ్ అగ్రికల్చర్ కళాశాలలో శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహించారు. అగ్రికల్చర్ పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులకు విజయవాడ సమీపంలోని తిరువూరుకు చెందిన సాయిల్ సే ఆర్గానిక్ వెజిటబుల్ ప్రొడక్షన్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో కళాశాలకు చెందిన 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 12 మంది ఎంపికయ్యారు. కంపెనీ ప్రతినిధులు రాత పరీక్షలతో పాటు మౌఖిక ఇంటర్వ్యూలను జరిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ బచ్చు శ్రీనివాస్ రావు, డైరెక్టర్ బచ్చు కిరణ్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ అమృత గాయత్రి, కళాశాల ఇన్‌చార్జి భాషా, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఇంటర్వ్యూల్లో పాల్గొన్న విద్యార్థులు

రక్తదానం ప్రాణదానంతో సమానం

మాజీ మంత్రి డాక్టర్ శనక్కాయల అరుణ

గుంటూరు మెడికల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఒకరు చేసే రక్తదానంతో నలుగురికి నూతన జీవితాన్ని ప్రసాదించవచ్చని మాజీ మంత్రి, బీజేపీ నాయకురాలు డాక్టర్ శనక్కాయల అరుణ అన్నారు. శనివారం స్థానిక కొత్తపేటలోని అహల్య నర్సింగ్ హోమ్‌లో నిర్వాహకురాలు, ప్రముఖ ఐవీఎఫ్ స్పెషలిస్టు డాక్టర్ శనక్కాయల రాజకుమారి పుట్టిన రోజు సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది తలసీమియా చిన్నారుల కోసం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. మాజీ మంత్రి డాక్టర్ అరుణ మాట్లాడుతూ తలసీమియా బాధితులకు జీవితాంతం రక్తం మారుస్తూ ఉండాలని చెప్పారు. అలాంటివారి కోసం ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని సూచించారు. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేరని, ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి రక్తదానం చేయడం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని కాపాడవచ్చన్నారు. రక్తదానంపై అపోహలు వీడి, యువత స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని బీజేపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ పిలుపునిచ్చారు. స్వచ్ఛందంగా ఆయన రక్తదానం చేసి రక్తదానం చేసిన వైద్యులు, వైద్య సిబ్బందికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది, బీజేపీ నేతలు పాల్గొన్నారు.



రక్తదాత డాక్టర్ ఉమాశంకర్‌ను అభినందిస్తున్న మాజీ మంత్రి డాక్టర్ అరుణ, డాక్టర్ రాజకుమారి

టెండర్ పొందిన వారే చెత్త తరలించాలి

మేయర్ రవీంద్ర

నెహ్రూనగర్: నగర పాలక సంస్థ పరిధిలో హోల్‌సేల్ మార్కెట్లలలో ఆశీలు వసూలుకు టెండర్ పొందిన వారే నిర్దేశిత ప్రాంతంలోనే ఆశీలు వసూలు చేయడంతో పాటు ఆయా ప్రాంతాలలో వ్యర్థాలను కూడా వారే తొలగించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర కోరారు. శనివారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలసి బండ్ల బజార్(హోల్ సేల్ ఫ్రూట్ మార్కెట్), లాలాపేట, పట్నంబజార్, ఆదర్శ నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ క్లీన్ - గ్రీన్ గుంటూరు కోసం నగర పాలక సంస్థ అన్ని విభాగాలు ప్రత్యేక దృష్టితో కృషి చేస్తున్నామని, ఇందుకు నగర ప్రజలు, వ్యాపార సంస్థలు సహకరించాలని కోరారు. నగర నడిబొడ్డులోని పట్నంబజారులో ప్రతి రోజు క్వింటాళ్ల కొద్దీ వ్యర్థాలు వస్తున్నాయని, వాటిని సరైన పద్ధతిలో తొలగించకపోవడం వలన స్థానికంగా తీవ్ర సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధ్యం మెరుగుదలకు గత కొంతకాలంగా అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. అదనపు కార్మికులు, వాహనాలు, పుష్ కార్ట్స్, సామగ్రిని అందించామని చెప్పారు. శానిటరీ వార్డుల వారీగా ఉదయం సాయంత్రం పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణకు నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. లాలాపేట, పట్నం బజారు, బండ్ల బజారు ప్రాంతాలలో హోల్ సేల్ వ్యాపారస్తుల నుంచి ఆశీలు వసూలు చేసే టెండర్ దారు ఆయా ప్రాంతాల పరిశుభ్రత బాధ్యత తీసుకోవాలని కోరారు. ఆదర్శ నగర్‌లో తాగునీటి సరఫరాపై అందిన ఫిర్యాదు ప్రాంతాన్ని పరిశీలించి, సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఇంజిరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్లు మహమ్మద్ చిష్టి, ఈరంటి వరప్రసాద్, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.



మార్కెట్‌లో పర్యటిస్తున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు

నిర్లక్ష్యంతో నిండు ప్రాణాలు బలి

గుంటూరు మెడికల్: వైద్యులు, వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతోనే యువకుడి ప్రాణం పోయిందని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా ఆరోపించారు. జీజీహెచ్‌లో వైద్యుల నిర్లక్ష్యంతో చనిపోయిన యువకుడి కుటుంబ సభ్యులను షేక్ నూరిఫాతిమా పరామర్శించారు. యువకుడి భౌతికాయాన్ని సందర్శించి మృతికి గల కారణాలు వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ జనరల్ వార్డుకు తరలించిన నాలుగు గంటల వ్యవధిలోనే సైదా చనిపోవడం వైద్యుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. యువకుడి మృతిపై ఆసుపత్రి అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. యువకుడి మృతిపై తక్షణమే విచారణ జరిపించి న్యాయం చేయాలన్నారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో వైద్య రంగం ఎంతో అభివృద్ధి చెందిందని, ముఖ్యంగా గుంటూరు జీజీహెచ్‌లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి అభివృద్ధికి కేరాఫ్‌గా ఆసుపత్రిని తీర్చిదిద్దారన్నారు. నేటి ప్రభుత్వం జీజీహెచ్‌ను పట్టించుకోవడం లేదని, అందువల్లే నిర్లక్ష్యం కనిపిస్తుందన్నారు. ప్రజాప్రతినిధులు జీజీహెచ్ రూపు రేఖలు మార్చామంటూ చెబుతున్నప్పటికీ నిర్లక్ష్యం ఏమాత్రం మారలేదన్నారు. యువకుడి కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. కడుపు నొప్పితో బాధపడుతూ మూడు రోజుల క్రితం క్యాజువాలిటీకి చికిత్స కోసం వెళ్లిన షేక్ సైదాను క్యాజువాల్టీలో పరీక్షించిన వైద్యులు ఐసీయూకు తరలించారు. ఐసీయూలో పూర్తి చికిత్స అందించకుండానే వైద్యులు పట్టించుకోకుండా 104 వార్డుకు తరలించారని, అందువల్లే తమ బిడ్డ చనిపోయాడంటూ సైదా కుటుంబ సభ్యులు మీడియాకు వెల్లడించారు.

వేసవి శిక్షణతో విద్యార్థుల్లో ఉల్లాసం

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో ఉల్లాసాన్ని కలిగించి, ఉత్సాహాన్ని నింపేందుకు వేసవి శిక్షణ శిబిరం దోహదం చేస్తుందని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. జేకేసీ కళాశాలరోడ్డులోని కేఎల్‌పీ స్కూల్లో శనివారం వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ శిబిరంలో భాగంగా క్రీడలతో పాటు వివిధ రకాల ఆటల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. క్రీడా, ఆటల పోటీలతో పాటు మొత్తం 160 మంది విద్యార్థులకు సంగీత, నృత్య అంశాలు, కర్రసాము, తైక్వాండో శిక్షణ హాజరైనట్లు పేర్కొన్నారు. విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, శారీరక దారుఢ్యం ఏర్పడటంతో పాటు వారిలో చురుకుదనం, చదువులో ముందుకు వెళ్లేందుకు ఉత్సాహం కలుగుతాయని అన్నారు.